# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **నాణ్యమైన తీర్పులంటే న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.**

2. **వేటపాలెం ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున 20 లక్షల రూపాయలు చొప్పున నష్టపరిహారం చెక్కులను అందించారు.**

3. **మాదక ద్రవ్యాల నియంత్రణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు సూచించారు.**

4. **ఐసిసి పురుషుల టి 20 వరల్డ్ కప్ లో భాగంగా సూపర్-8 విభాగంలో భారత్, వెస్టిండీస్ జట్లు ఈ రోజు తలపడనున్నాయి.**

5. **ప్రపంచ పౌర రక్షణ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు.**

==========================

నాణ్యమైన తీర్పులంటే న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. తిరుపతి రూరల్ మండలం దామినేడు వద్ద 120 కోట్ల రూపాయలతో 14.44 ఎకరాలలో నూతనంగా నిర్మించనున్న 16 కోర్టు భవనాల సముదాయానికి ఈరోజు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీ లు పాల్గొన్నారు. న్యాయం అందించటంలో నిర్దేశిత గడువు ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలియజేస్తూ..

..వాయిస్..30 సెకన్లు

--------------------------

కాకినాడ జల్లా వేట్లపాలెం బాణసంచా దుకాణంలో పేలుడు ఘటన కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున నష్టపరిహారం కింద 20 లక్షల రూపాయల చెక్కులను హోంమంత్రి వంగలపూడి అనిత, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి

అనిత మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. బాణసంచా ప్రమాదంపై విచారణకు ఆదేశించినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలియజేస్తూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పారిశ్రామికీకరణ మరింత వేగంగా జరుగుతోందని... నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కొడవలూరు మండలం రేగడిచిలకలోని కేంద్ర ప్రభుత్వ ఇఫ్కో కిసాన్ సెజ్ లో 260 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంట్ కు ఈరోజు స్థానిక శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా దాదాపు 700 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు ఈ ప్రాంతానికి రానున్నాయని ఆయన వెల్లడించారు.

---------------------------

సమాజంలో మహిళల భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమాలలో భాగంగా ఈరోజు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గణేష్ కూడలి వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా వారోత్సవాలలో భాగంగా ఈ సైకిల్ ర్యాలీ నిర్వహించడం వెనుక ఒక ప్రత్యేకత ఉందని చెప్పారు. సైకిల్ తొక్కడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా చేకూరుతోందని తెలిపారు.

---------------------------

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలల అధ్యాపకులకు 'డిసిప్లేన్– స్పెసిఫిక్ అప్లికేషన్స్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అంశంపై ఐదు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి బి.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ సెల్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీలో రేపటి నుండి 6వ తేదీ వరకు ఈ కార్యశాల జరగనుందని తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 200 మంది అధ్యాపకులకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

---------------------------

మాదక ద్రవ్యాల నియంత్రణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు సూచించారు. విజయవాడలో నిర్వహించిన డ్రగ్స్ పై దండయాత్ర సైకిల్ యాత్రకు ఈ రోజు ముగింపు విజయోత్సవ కార్యక్రమంలో ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ.. 34 రోజుల పాటు జరిగిన ఈ యాత్ర ప్రజల్లో నమ్మకం, విద్యార్థుల్లో బాధ్యతను పెంపొందించిందని పేర్కొన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని సీపీ రాజశేఖర్ బాబు తెలియజేస్తూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి వార్ల ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా మూసి వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన ప్రధాన ఆలయంతో సహా ఉప ఆలయాలను కూడా మూసి వేయనున్నట్లు చెప్పారు. తిరిగి ఈనెల 4వ తేదీ ఉదయం 8 గంటలకు సర్వదర్శనం ప్రారంభం కానుందని ఆయన వెల్లడించారు.

---------------------------

ఐసిసి పురుషుల టి 20 వరల్డ్ కప్ లో భాగంగా సూపర్-8 విభాగంలో భారత్, వెస్టిండీస్ జట్లు ఈ రోజు తలపడనున్నాయి. కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీస్‌కు వెళ్లేందుకు అవకాశం లభిస్తుంది. రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. అంతకు ముందు సూపర్ 8 విభాగంలో ఢిల్లీలోని అరుణ్ జేట్లీ స్టేడియం వేదికగా జింబాబ్వే, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

---------------------------

ప్రతి సంవత్సరం మార్చి 1వ తేదీన ప్రపంచ పౌర రక్షణ దినోత్సవం జరుపుకుంటున్నారు. ప్రమాదాలు, విపత్తులు సంభవించినప్పుడు ఎలా సురక్షితంగా ఉండాలో ప్రజలకు అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. అంతర్జాతీయ పౌర రక్షణ సంస్థ (ICDO) మొదటిసారిగా 1990లో ప్రపంచ పౌర రక్షణ దినోత్సవం నిర్వహణను ప్రారంభించింది.

---------------------------

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ పీజీ లాసెట్-2026కు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు లాసెట్ కన్వీనర్, మహిళా వర్సిటీ న్యాయవిభాగం ఆచార్యులు సీతాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 3, 5 సంవత్సరాల ఎల్ఎల్‌బీ, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అపరాధ రుసుముతో వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మే 4న ప్రవేశ పరీక్ష ఉంటుందని, మరిన్ని వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ఆమె సూచించారు.

---------------------------

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని బాపట్ల జిల్లా పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు తెలిపారు. పర్చూరు నియోజకవర్గంలోని కోలలపూడి గ్రామంలో మార్క్ ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ భావనతో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈసందర్భంగా శాసనసభ్యులు సాంబశివరావు మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రతి రైతు పండించిన పంటను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పంటను కేంద్రాలకు తీసుకురావాలని రైతులను కోరారు.

=====================